పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించండి

● అటవీ సంరక్షణశాఖ ప్రధానాధికారికి ఎమ్మెల్యే విన్నపం

మన్సూరాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డంపింగ్ యార్డు సమీపంలో గల పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించాలని అటవీ సంరక్షణశాఖ ప్రధాన అధికారి రాకేష్ మోహన్ డొబ్రియల్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలోనూ మన్సూరాబాద్ పరిధిలోని పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించాలంటూ పలుమార్లు ప్రస్తావించినట్లు తెలిపారు. రోడ్డు వేసేందుకు ఎక్కువ స్థలం అటవీ శాఖకే చెందినదని తెలియజేసిన నేపథ్యంలో ప్రస్తుతం అధికారులు సర్వే చేపట్టి 200 మీటర్ల కంటే తక్కువ స్థలం అటవీ శాఖ ఆధీనంలో ఉందని తేలినట్లు తెలిపారు. వెంటనే తగు నిర్ణయం తీసుకుని రోడ్డు పునరుద్ధరణ చేపట్టేందుకు సహకరించాలని విన్నపించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన అటవీశాఖ ప్రధానాధికారి 200 మీటర్ల అటవీ స్థలం గురించి పలువురు అధికారులతో వెంటనే చర్చలు జరిపి రోడ్డు పునరుద్ధరణకు తప్పకుండా సహకరిస్తానని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులను కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రవి ముదిరాజ్, అశోకప్ప తదితరులు ఉన్నారు.



అటవీశాఖ ప్రధానాధికారితో రోడ్డు పునరుద్ధరణ విషయమై చర్చిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తాం

వనస్థలిపురం : బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శివారు కాలనీల్లో పలు కారణాలతో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులను త్వరితగతిని చేపట్టి, భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శివారు కాలనీలకు ట్రంక్ లైన్, భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో శివారు కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ఇతర కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తమ శివారు కాలనీలకు ట్రంక్‌లైన్, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమకు పెండింగ్‌లో ఉన్న ట్రంక్‌లైన్‌తో పాటు భూగర్భ డ్రైనేజీని పూర్తిచేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు విడతలుగా నిధులు మంజూరు చేయించి సుమారు రూ.3.5కోట్లతో రెండు వరుసల పైపులు వేయించామన్నారు. ఈ తరుణంలో పైప్‌లైన్ పనులకు వ్యవసాయదారుల భూములు ఉండడంతో ఆ పైప్‌లైన్ పనులు ముందుకు సాగలేదని గుర్తుచేశారు. వ్యవసాయదారులతో త్వరలోనే మాట్లాడి శ్రీగాయత్రినగర్ నుంచి శ్రీపాపిరెడ్డికాలనీ మీదుగా వచ్చిన ట్రంక్‌లైన్ పనులు రాబోయే ఉగాది వరకు పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలు కాలనీల అధ్యక్షులు మనోజ్‌కుమార్, శ్రీశైలం, కృష్ణ, రమేష్, రాజుగౌడ్, రాంబాబునాయక్, నర్సిరెడ్డి, లక్ష్మీపతి, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి చర్యలు

చంపాపేట : కాలనీ అభివృద్ధి కోసం సత్వర చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు దోర్నాల విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ కాలనీలో యూజీడీ, సీసీ రహదారుల నిర్మాణం, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డికి ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, కాలనీ ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌యాదవ్, మంద ప్రవీణ్, కోశాధికారి రాహుల్‌సాగర్, కార్యవర్గ సభ్యులు, కాలనీ ప్రతినిధులు విష్ణువర్ధన్, లాల్‌రెడ్డి, మంద శ్రీనివాస్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, ఐలేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అల్వాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇటీవల వనస్థలిపురం నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్. శ్రీనివాస్‌ను శుక్రవారం సీపీఐ రాష్ట్ర నాయకుడు ఆందోజు రవీంద్రచారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, బాతరాజు నర్సింహ, బోయపల్లి రాములుగౌడ్, సక్రునాయక్, మద్దిలేటి, వెంకట్, నాగేష్‌గౌడ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
- వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

బడంగ్‌పేట్ బ్రాహ్మణ సేవా సమితి కార్యవర్గం ఎన్నిక

● రేపు ప్రమాణ స్వీకారం

సరూర్‌నగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ బ్రాహ్మణ సేవా సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.రామ్మోహన్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పి.శ్రీరామశర్మ, ఎం.కామేశ్వరరావు, డి.సాయిజ్యోతి, ఉపాధ్యక్షులుగా ఆర్.భాస్కరహరిఅన్నాజీ, కేవీకే రామారావు, ఎం.సుగుణాదేవి, ప్రధాన కార్యదర్శిగా ఏఎస్ఎస్ మూర్తి, సహాయ కార్యదర్శులుగా వైవీ వేణుగోపాల్, ఎంవీ పద్మావతి, జె.దత్తాత్రేయ శర్మ, బి.మదన్‌మోహన్‌శర్మ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి.శ్రవణ్‌కుమార్, డాక్టర్ పీఎస్‌ఎకే విక్రమ్‌శర్మ, ఆర్.పద్మజ, కార్యవర్గ సభ్యులుగా ఎ.భాస్కర్, ఎం.వెంకటరమణ, వర్ధనమ్మ, శంతన్‌కుమార్, బిందుమాధవ్ ఎన్నికయ్యారు.

సమితి యువజన విభాగం..

బ్రాహ్మణ సేవా సమితి యువజన విభాగం కార్యవర్గాన్ని సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీవీఎస్ నాగేంద్రశర్మ, ఉపాధ్యక్షుడిగా ఎం.ఈశ్వరవిశ్వనాథ్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా ఎం.వంశీశర్మ, సభ్యులుగా తేజశర్మ, సీహెచ్ శ్రావణ్‌కుమార్, ఆర్.చంద్రిక, అపర్ణ ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయా కార్యవర్గాలు ఆదివారం ఇక్కడి ఎంసీఆర్ కాలనీలోని శ్రీవాణిగాయత్రీ భవనంలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేయనున్నాయని సమితి ప్రతినిధులు శ్రీరామశర్మ, శ్రవణ్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా శనివారం 11కేవీ కుర్మగూడ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, దర్గా ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, కోదండరాంనగర్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు, ఆర్యసమాజ్, పల్టన్ ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ హన్మంతరెడ్డి తెలిపారు.

పొంగుతున్న డ్రైనేజీలు.. కుంగుతున్న మ్యాన్‌హోల్స్



మానస గార్డెన్ నుంచి రెడ్డిబస్తీలోకి వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

చంపాపేట,అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ రెడ్డిబస్తీ, ఎడబస్తీ, మోడల్ మార్కెట్ ఎదుట నిత్యం డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నా పట్టించుకునేనాథుడు కరువయ్యారు. మోడల్ మార్కెట్ ఎదుట ప్రధాన రహదారిపై నెలల తరబడి డ్రైనేజీ పొంగుతుండడంతో జలమండలి అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లోని మానసగార్డెన్ నుంచి రెడ్డిబస్తీ, ఎడబస్తీ వెళ్లేదారిలో నిత్యం డ్రైనేజీలు పొంగుతున్నాయి. దీంతో డ్రైనేజీ మ్యాన్‌హోల్ పక్కన గోతులు ఏర్పడి నీరు అందులోకి వెళ్తుంది. కాలం చెల్లిన మ్యాన్‌హోల్స్ పైనుంచి వాహనాలు వెళ్తుండడంతో అవి ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. రాత్రి వేళ వెళ్లే బాటసారులు మ్యాన్‌హోల్స్ పక్కన ఏర్పడిన గోతులలో కాళ్లు పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు తగిన చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు అండగా ఉంటా : మార్కెట్ కమిటీ చైర్మన్

ఎల్బీనగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు వచ్చే రైతులకు అండగా ఉంటూ వినియోగదారులకు కూడా న్యాయం చేస్తామని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్‌ను పాలకవర్గంతో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. మార్కెట్ మొత్తం కలియ దిరిగి రైతులు, వినియోగదారులు, వర్తకులు, హోల్‌సేల్ వ్యాపారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలుక నర్సింహారెడ్డి యూనియన్ భవనంలో పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా రైతులు, వ్యాపారులు, హమాలీలు, మార్కెట్ ఉద్యోగులు పాలకవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు తమకు ముఖ్యమన్నారు. రైతుకు గిట్టుబాటు ధర ఇచ్చేలా చూస్తామని తెలిపారు. మార్కెట్‌లో రైతులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వినియోగదారులకు ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేపడుతూ మార్కెట్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్‌లో దళారీ వ్యవస్థను అరికట్టాలన్నారు. వచ్చిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు, వర్తకులు, వినియోగదారులు, అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలు పరిష్కరిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమం లో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, చిలుకూరి మచ్చేంద్రరెడ్డి, చిన్నారెడ్డి రఘుపతిరెడ్డి, చుంచు నర్సింహ, మెగావత్ గణేష్‌నాయక్, కులపాటి నవరాజ్, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, దోమలపల్లి అంజయ్య, జిన్నం వెంకటేశ్వర్లు, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, ఎన్టీఆర్‌నగర్ మార్కెట్ కార్యదర్శి ఎండీ వహీద్ పాల్గొన్నారు.



మార్కెట్‌లో మహిళతో మాట్లాడుతున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

దుర్భర పరిస్థితిలో ఆటో కార్మికుల జీవితాలు : ఏఐటీయూసీ

ఎల్బీనగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల జీవితాలు దుర్భరస్థితిలో ఉన్నాయని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్బీనగర్ రింగ్ రోడ్ చౌరస్తాలోని ఆటోస్టాండ్ దగ్గర కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. ప్రైవేటు వాహనాలను ఓలా, ఉబర్ పేరిట నడుపుతూ ఆటో కార్మికుల పొట్టగొడుతున్నారన్నారు. ప్రైవేటు ఓన్ వాహనాలను టూవీలర్ ట్యాక్సీలు నడుపుతు ఒకవైపు ప్రభుత్వానికి నష్టం చేకూరుస్తు మరో వైపు ఆటో కార్మికులను రోడ్డున పడేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే వాటిని నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. ఆటో కార్మికులకు డబుల్‌బెడ్రూం ఇళ్లను కేటాయించాలని కోరారు. ఆటో డ్రైవర్లను ట్రాఫిక్ చాలాన్ల పేరిట పోలీసులు వేధిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల అధ్యక్షుడు బోయపల్లి రాములుగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి, ఏఐటీయూసీ ఆర్టీసీ రంగారెడ్డి జిల్లా ఆఫీస్ బేరర్ వెంకన్న, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు బాతరాజు నర్సింహ, ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల కార్యదర్శి మద్దిలేటి, సక్రునాయక్, ఆటో కార్మికులు కృష్ణమూర్తి, రాజు, బాలశేఖర్, వెంకటేశ్, శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు

లేబర్ అడ్డాపై రూ. 5 కే భోజనం ఏర్పాటు చేయాలి

హయత్‌నగర్ : లేబర్ అడ్డాలపై ఐదు రూపాయల భోజన వసతి కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం హయత్‌నగర్ లేబర్ అడ్డాలో జరిగిన అడ్డా కూలీల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులందరూ సంక్షేమ బోర్డులో పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నగరంలోని అన్ని లేబర్ అడ్డాలపై ఐదు రూపాయల భోజనం ఏర్పాటు చేయాలని కోరారు. బహుళ అంతస్తుల నిర్మాణాల నుంచి రెండు శాతం సెస్సు సేకరించి కార్మిక సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కొంత కాలంగా ప్రభుత్వం కార్మికులకు చెందాల్సిన సెస్సును పక్కదారి పట్టిస్తుందని ఆరోపించారు. సంక్షేమ బోర్డు నిధులు కేవలం కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలన్నారు. ఏఐటీయూసీ హయత్‌నగర్ మండల కార్యదర్శి సక్రునాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్, నాయకులు వెంకట్, నాగేష్‌గౌడ్, శోభన్, మధు, రామచంద్రం, స్వరూప, రామకృష్ణ, వెంకట్, శ్రీధర్‌రెడ్డి, రాములుగౌడ్ పాల్గొన్నారు.

మనిషికి మానసిక ఆరోగ్యం అవసరం : శ్రీదేవి

ఎల్బీనగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మనిషికి మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సరూర్‌నగర్‌లోని డిస్ట్రిక్ట్ డిసెబులిటీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం అనేది శారీరక ఆరోగ్యం కంటే కూడా ముఖ్యమైనదన్నారు. శరీరం బలంగా ఉన్నప్పటికీ మనస్సు ప్రశాంతంగా లేకపోతే జీవితం సంతోషకరంగా ఉండదన్నారు. మానసిక సమస్యలను అర్థం చేసుకోవడం, అవగాహన కల్పించడం, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించ డం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ ముఖ్యఉద్దేశమన్నారు. మానసిక ఆరోగ్యం అనేది ప్రతి మనిషి జీవితంలో ఒక భాగమన్నారు. మానసిక స్థిరత్వం, మనః శాంతి, సంతోషం వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసేవన్నారు. అయితే చాలా మందికి మానసిక ఆరోగ్యంపై సరైన అవగాహన ఉండదన్నారు. మానసిక ఆరోగ్యం సమస్యలను సిగ్గుగా భావించి ఇతరులతో పంచుకోకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతుందన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించడం ద్వారా మానసిక సమస్యలపై ఉన్న అపోహలను తొలగించే కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి మానసిక సమస్యలు రావచ్చని అది సాధారణమన్నా రు. మనం మన భావాలను వ్యక్తం చేయడానికి భయపడకూడదన్నారు. మానసిక ఆరోగ్యం కోసం సలహాలు, సహాయం అందుబాటులో ఉన్నాయన్న విషయాన్ని సమాజంలోని ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి, జిల్లా వైద్య అధికారి చంద్రశేఖర్, సీడీపీఓ రేణుక, డీడీఆర్‌సీ నోడల్ అధికారి రమేష్, భుక్య కాశీం, శ్యామలదేవి, రఘు, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ దుర్మరణం

కొత్తపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తను నడిపే ట్రాక్టరే తన మృత్యు శకటమై డ్రైవర్ దుర్మరణం పాలైన సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరుకు చెందిన షేక్ మౌలానా(57) వనస్థలిపురం కాంట్రాక్టర్ ఏమధుకర్‌రెడ్డి వద్ద మహీంద్ర స్వరాజ్ ట్రాక్టర్ ట్రాలీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 17న ఉదయం 8గంటలకు కాంట్రాక్టర్ ఆదేశాల మేరకు అతడు హస్తినాపురం మ్యాక్స్ షోరూమ్ భవనం సెల్లార్‌లో మట్టి తొలగించడానికి టాక్టర్ తీసుకుని బయలుదేరాడు. అతడు రెండు మూడు ట్రిప్పులు మట్టి ట్రాలీలో బయటకు తరలించాడు. తర్వాత 11.30 గంటలకు అతడు సెల్లార్‌లో ఉన్న మట్టిని ట్రాక్టర్ ట్రాలీలో తీసుకుని భవనం ర్యాంపు మీదుగా వెళ్తున్నాడు. కొద్దిగా పైకి వెళ్లిన వెంటనే ట్రాక్టర్ తిరగబడి అతడి మీదే పడిపోయింది. పని దగ్గరలో ఉన్న వాళ్లు ట్రాక్టర్‌ను తొలగించి చూడగా షేక్ మౌలానా ముఖంపైనా, తలపైనా, ఛాతీపైనా తీవ్రగాయాలై మృతిచెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి భార్య షేక్ బిపాసా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మౌలానా మృతదేహం

539 గ్రాముల గంజాయి స్వాధీనం

● ఇద్దరు పెడ్లర్లు అరెస్టు

కొత్తపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని సీరీస్ రోడ్డులో ఎస్‌ఓటీ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు గంజాయి కొనుగోలు చేసిన వినియోగదారులు, పెడ్లర్లు అయిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన విజయకుమార్ సోనీ(45), హేమూ సింగ్(40) కొన్నేళ్ల క్రితం నగరానికి బతుకుదెరువు కోసం వచ్చారు. విజయకుమార్ సోనీ భరత్‌నగర్‌లో ఉంటూ మార్బుల్ పనులు చేస్తుండగా హేమూసింగ్ నాగోల్ జైపురి కాలనీ నువ్వులబండలో ఉంటూ మార్బుల్ షాపులో పనిచేస్తున్నాడు. ఇద్దరూ మాదక ద్రవ్యాల సేవనానికి బానిసలయ్యారు. సులభంగా డబ్బు సంపాదించడానికి గంజాయి విక్రయించడం మొదలుపెట్టారు. నాగోల్‌కు చెందిన సంజీవతో ఇద్దరూ గంజాయి కొనుగోలు చేయడంతో పాటు గంజాయిని అధిక ధరకు విక్రయించేవారు. ఈనెల 16న సంజీవ సీరీస్ రోడ్డులో వారిద్దరికీ గంజాయి విక్రయించి వెళ్లిపోయాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు సీరీస్ రోడ్డుకు చేరుకుని విజయకుమార్ సోనీ, హేమూ సింగ్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద 539 గ్రాముల గంజాయి, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని శుక్రవారం రిమాండుకు తరలించారు. సంజీవ పరారీలో ఉన్నాడు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

చాదర్‌ఘాట్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులతో కలిసి తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన మహార్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే నిర్లక్ష్యవైఖరిని అవలంబిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10నెలలు గడుస్తున్నా కనీసం విద్యార్థుల సమస్యలపై, విద్యాశాఖపై సమీక్ష జరిపిన దాఖలాలు లేవని ఆయన విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదలకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేకపోతే విద్యార్థులతో కలిసి మహాధర్నాకు దిగుతామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఎలిజబెత్, గ్రేటర్ కార్యదర్శి యోగేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల మహార్యాలీలో తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహేష్‌కుమార్ తదితరులు

ప్రతీ ఇంటికి ఇంకుడుగుంత నిర్మాణం తప్పనిసరి

ఓల్డ్‌మలక్‌పేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రతి ఇంట్లో విధిగా ఇంకుడుగుంతను నిర్మించుకోవాలని జలమండలి మలక్‌పేట డీజీఎం సయ్యద్ హస్మత్‌అలీ సూచించారు. శుక్రవారం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో ఇంకుడుగుంతలులేని ఇళ్లకు అపార్ట్‌మెంట్ల యజమానులకు ఆయన నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా 90రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని అందులో భాగంగా ఇంకుడుగుంతలు లేని ఇళ్లను గుర్తించి నోటీసులు జారి చేస్తూ సత్వరమే నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇంకుడుగుంతల నిర్మాణంపై వాటి ఉపయోగాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. నూతనంగా ఇల్లు నిర్మించుకునే వారికి ముందుగా ఇంకుడుగుంత నిర్మాణం చేపట్టాకే ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. ఇంకుడుగుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాల స్థాయి పెరిగి భవిష్యత్తులో నీటి కొరత రాకుండా ఉంటుందన్నారు. దీనికి అందరు సహకరించాలని కోరారు.



ఇంకుడుగుంత లేని ఇంటి యజమానికి నోటీసులు ఇస్తున్న డీజీఎం హస్మత్‌అలీ

ధర్మ పరిరక్షణకు బీజేపీ సభ్యత్వం తీసుకోవాలి

● పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్‌గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామంలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్త అశోక్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమా రు 150 మంది కార్యకర్తలకు పార్టీ సభ్యత్వాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు దేశ ప్రధాని నరేంద్రమోదీ వైపు చూస్తున్నాయన్నారు. ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, వడ్డేపల్లి పాపయ్యగౌడ్, మోహన్‌రెడ్డి, మధుగౌడ్, గోవర్ధన్‌గౌడ్, రమేష్‌గౌడ్, మదారి, కృష్ణ, మైసయ్య, లక్ష్మయ్య, సాయికిరణ్‌గౌడ్, నరేష్, ప్రశాంత్, నవీన్ పాల్గొన్నారు.



పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో అశోక్‌గౌడ్ తదితరులు

పాతబస్తీలో సభ్యత్వ నమోదు

సైదాబాద్ : పాతబస్తీలో బీజేపీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభిస్తున్నదని ఐఎస్ సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తెలిపారు. శుక్రవారం వినయ్‌నగర్‌లో ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. యాఖత్‌పురా నియోజకవర్గం పరిధిలో రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, నేతలు అమ్రేష్, భీష్మాచారి, వెంకట్, లక్ష్మణ్, నేతాజీ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో కార్పొరేటర్ శ్వేతారెడ్డి

రహదారి మధ్యలో వృక్షం..

ప్రమాదకరంగా యూటర్న్ మలుపు

● నిత్యం ప్రమాదాలకు గురవుతున్న వాహనాలు

చంపాపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ మందమల్లమ్మ చౌరస్తా సమీపంలోని ప్రధాన రహదారిపై వృక్షం ఉండడంతో యూటర్న్ తీసుకుంటున్న వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. చంపాపేట వైపు నుంచి వచ్చే వాహనదారులు విశ్వాస్ ఆస్పత్రి వద్ద యూటర్న్ తీసుకునే మలుపులో భారీ వృక్షం అడ్డంకిగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుచున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. రాత్రి వేళ వాహనాలు యూటర్న్ వద్ద వేగంగా వస్తూ మలుపు తీసుకుంటుండగా వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఆ ప్రదేశంలో నిత్యం ట్రాఫిక్ పోలీసులు ఉంటూ వాహనాల తనిఖీలు చేపడుతున్నారే తప్ప యూటర్న్ సమస్యను మాత్రం పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రహదారిపై ఉన్న వృక్షం వాహనాలకు అడ్డంకిగా ఉండకుండా యూటర్న్ వద్ద మార్పులు చేయాలని వాహనదారులు ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులను వారు కోరుతున్నారు.



చంపాపేట డివిజన్ మందమల్లమ్మ చౌరస్తా విశ్వాస్ ఆస్పత్రి ఎదుట యూటర్న్ వద్ద రహదారి మధ్యలో ఉన్న వృక్షం